క్లుప్తంగా

ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం



అధికారులతో సమీక్షిస్తున్న శ్రీనివాసరావు, జమదగ్ని

వంగర: ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని జిల్లా మైక్రో ఇరిగేషన్ పీడీ ఆర్. శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఏవీఎస్ జమదగ్ని అన్నారు. మండల కేంద్రంలో రూ.30 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ భవనం, కోల్డ్ స్టోరేజ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ.. పామాయిల్, జీడి, మామిడితో పాటు పలు రకాల కూరగాయలు సాగుతో లాభాలు ఆర్జించవచ్చన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ గొడౌన్‌లో వివిధ రకాల ఉత్పత్తులు నిల్వ చేసి తరలించేందుకు వాహనం మంజూరు చేయాలని ఆ సంస్థ అధ్యక్షుడు గంటా రామ్మోహనరావు కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ ఏపీఎం బాసిన గోవిందరావు, రాజాం ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ ఉమామహేశ్వరి, కోశాధికారి దుర్గారావు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

రాజాం: పట్టణ పరిధిలోని శ్రీకాకుళం రోడ్డులో అంతకాపల్లి గ్రామ రెవెన్యూ పరిధికి చెందిన ఎరుకువాని చెరువులో ఆక్రమణలు తొలగించాలని చెరువు ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ చెరువు వద్దకు ఆయకట్టు రైతులు మజ్జి హరి, లెంక వెంకటరమణ, లెంక అన్నంనాయుడు, లెంక సత్యంనాయుడు, లెంక గణేష్, లెంక లోకేష్, లెంక నవీన్, లెంక అఖిల్, లెంక సత్యంనాయుడు, తదితరులు బుధవారం చేరుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆక్రమణలపై గతంలో స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. ఆక్రమణల కారణంగా చెరువులో చుక్క నీరు కూడా ఉండడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎస్‌కే రాజు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సర్వే చేపట్టాలని సర్వేయర్ గోవిందరావు, వీఆర్‌ఓ అనంతరావులను ఆదేశించారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



తెర్లాంలో వితంతు మహిళకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కుమారి

తెర్లాం: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ సామాజిక పెన్షన్ పథకంలో భాగంగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం రెండో రోజు కూడా కొనసాగింది. ఈ పథకం కింద వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారుల పెన్షన్లకు సంబంధించి వారి నుంచి బయోమెట్రిక్ వేలిముద్రలు, ఐరిస్, ఫేషియల్ ద్వారా గ్రామ వలంటీర్లు పెన్షన్‌లు అందజేశారు. మొదటి రోజున పింఛన్లు తీసుకొనేందుకు అందుబాటులో లేని పెన్షన్‌దారులకు బుధవారం గ్రామ వలంటీర్లు వారి ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు.

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ



ఓటరు జాబితా సవరణలో ఎంపీపీతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొబ్బిలి: ఓటరు జాబితా సవరణలో ఇంటింటి సర్వే చేసి జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని పక్కి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి సర్వే కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు ఇంటి వద్ద తహసీల్దార్ స్వయంగా సర్వే చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మండలంలోని కలువరాయి జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎలా అమలు చేస్తున్నారన్న అంశంపై తహసీల్దార్ డోల రాజేశ్వరరావు తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు రుచి చూశారు. అనంతరం కోమటిపల్లిలో పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలు పాటిస్తున్నారా లేదానని పరిశీలించారు.

పక్కాగా ఓటర్ల సర్వే

సంతకవిటి: ఓటర్ల సర్వే పక్కాగా జరుగుతోందని తహసీల్దార్ ఎ. సులోచనారాణి తెలిపారు. మండలంలోని బొద్దూరు, జీఎస్ పురం, తాలాడ, గరికిపాడు, తదితర గ్రామాలలో బీఎల్‌ఓలు బుధవారం ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ సులోచనారాణి సర్వే తీరును పరిశీలించి, సక్రమంగా ఓటర్ల జాబితా తయారు చేయాలని సూచించారు.

గుర్తింపు కార్డులు అందజేయాలి

రాజాం సిటీ: కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందజేయాలని తహసీల్దార్ ఎస్‌కే రాజు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సచివాలయ వీఆర్వోలు, వీపీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఇప్పటికే గుర్తించిన కౌలురైతులకు ఈ నెల 7లోగా కార్డులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.రేణుకాసాయి ఉన్నారు.

ఇకపై ఇంటికే పౌష్టికాహారం

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



రాజాం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: అంగన్‌వాడీ కేంద్రాల వద్ద లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం ఇకపై ఇళ్ల వద్దే అందిస్తారని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రణాళికాబద్ధంగా పౌష్టికాహార పంపిణీ జరుగుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం చాలీచాలని ఆహారం పంపిణీ చేసేదని, అలాగే అంగన్‌వాడీ పోస్టులను కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ -1, ప్రీ ప్రైమరీ -2 పాఠశాలలుగా మార్చి అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ, పౌష్టికాహార కిట్‌లో 3 కిలోల బియ్యం, కిలో పప్పు, అరలీటర్ ఆయిల్, ఐదులీటర్ల ఆవుపాలు, 25 గుడ్లు, రాగిపిండి 2 కిలోలు, అటుకులు కిలో, పల్లీల చెక్కీలు పావుకిలో, ఎండు ఖర్జూరం అరకిలో చొప్పున ఉంటున్నాయని వివరించారు. మాతా,శిశు మరణాల రేటును తగ్గించేందుకు ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడులు, జెడ్పీటీసీ సభ్యులు బండి నర్శింహులు, కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీలు నక్క వర్షిణి, యాలాల వెంకటేష్, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, సీడీపీఓ డాక్టర్ పి. కనకదుర్గ, సూపర్‌వైజర్లు సీహెచ్.సన్యాసమ్మ, జి.సుజాత, జి.జానకమ్మ, ఆర్‌పీ ప్రసన్న, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టేక్ హోమ్ రేషన్ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు వైఎస్సార్ పోషణ కిట్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎ.సులోచనారాణి మాట్లాడుతూ, ఇప్పటివరకు ఈ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు కేంద్రాల వద్ద పౌష్టికాహారం అందించేవారని, ఇకపై ఇళ్ల వద్దే అందిస్తారని చెప్పారు. మండలంలోని 89 అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ పథకం అమలవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణశ్రీ తెలిపారు. కార్యక్రమంలో సంతకవిటి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం..

రేగిడి: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్ మోహనరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగమణి, తహసీల్దార్ టి. కల్యాణచక్రవర్తి, రేగిడి, బూరాడ సెక్టార్ల సూపర్‌వైజర్లు శశికళ, నూకాలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం..

వంగర: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, డీటీ బూరాడ సుందరరావు, ఏఓ లోపింటి త్రినాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజని, అమ్మన్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఐసీడీఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో గర్భిణులు, బాలింతలు, శిశువులకు సంపూర్ణారోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లిపాల శ్రేష్ఠతను, ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సమాన పాళ్లలో అందిస్తే ఎంతో ఆరోగ్యమన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, సీడీపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెర్లాంలో..

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద లబ్ధిదార్లకు టీహెచ్‌ఆర్(టేక్ హోమ్ రేషన్) కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలంతా విజయవంతం చేయాలని తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. తెర్లాంలో టీహెచ్‌ఆర్ కిట్ల పంపిణీ ప్రారంభ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తెర్లాం, లోచర్ల సెక్టార్ల సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి, ఎంఈఓ త్రినాధరావు, పీహెచ్‌సీ డాక్టర్ వంశీ పాల్గొన్నారు.



బాడంగి: గర్భిణులు, బాలింతలకు టీహెచ్‌ఆర్ సరుకుల పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యే శంబంగి



సంతకవిటి: బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న అధికారులు



తెర్లాంలో గర్భిణికి పౌష్టికాహార కిట్‌ను అందజేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, తదితరులు



రేగిడి : వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్ మోహనరావు



రామభద్రపురం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



వంగర: కిట్లు అందిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



రాజాం సిటీ: గర్భిణీకి టీహెచ్‌ఆర్ కిట్ అందజేస్తున్న సర్పంచ్, తదితరులు

రామభద్రపురంలో..

రామభద్రపురం: గర్భిణులు,బాలింతలు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కోసం ఇక అంగన్‌వాడీ కేంద్రాల్లో పడిగాపులు పడాల్సిన అవసరం లేదని, దర్జాగా ఇంటి వద్దే ఉండి సరుకులు తీసుకోవచ్చునని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇంటింటికీ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. తహసీల్దార్ రాజారావు, ఎంపీడీో రమామణి, సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, వైస్ ఎంపీపీలు బెల్లాన ప్రసాదరావు, పెంకి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగిలో...

బాడంగి: మండలంలోని గొల్లాది ప్రాథమిక పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో టీహెచ్‌ఆర్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే చెప్పారు. ఎంపీపీ బోగి గౌరి, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, సర్పంచ్ కిరణ్‌కుమారి, ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పాగిరిలో..

రాజాం సిటీ: గర్భిణులు, బాలింతలకు టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్) కిట్లను సర్పంచ్ పాగిరి కృష్ణవేణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మన్మథరావు, సూపర్‌వైజర్ ప్రసన్న, పంచాయతీ కార్యదర్శి పద్మజ, మంగాదేవి, వరలక్ష్మి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే శంబంగి



గొల్లాదిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే జగనన్న లక్ష్యమని అందులో భాగంగానే ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని గొల్లాదిలో రూ.82 లక్షల 60వేలతో ఉపాధి నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా ప్రజల కోసం ఇంతగా ఆలోచించలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. దేశానికే ఆంధ్రప్రదేశ్ పాలన ఆదర్శంగా ఉందని అన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అన్ని సేవలు అందుతున్నాయన్నారు. విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామంలోనే దీర్ఘకాలిక రోగులకు సేవలు అందుతున్నాయని చెప్పారు. 104 ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో కుటుంబ వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి మరిపి శంకరరావు, ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ అజురఫీజాన్, ఏవో శిరీష, పీఆర్ డీఈఈ అప్పారావు, ఏఈ రమేష్ , ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్, గ్రామ సర్పంచ్ బేతనపల్లి కిరణ్‌కుమారి, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాలొన్నారు.

సచివాలయాల పరిధిలో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

రేగిడి: మండలంలో అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ, గ్రామాల్లో 17 సంవత్సరాలు దాటిన యువతీ యువకులతో పోటీలు నిర్వహించాలన్నారు. సచివాలయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మండల స్థాయిలో ఆడుతారని తెలిపారు. అక్టోబర్ 2 నుంచి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాడ్మింటన్ విభాగాల్లో పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగమణి, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, ఎంఈఓ-2 బి.ఎరకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అనేకం-సంక్షేమం అనంతం

- 'గడప గడపలో' ఎమ్మెల్యే శంబంగి



సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజలందరికీ ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టి అనంతమయిన సంక్షేమాన్ని అందజేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కమ్మవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వలంటీర్లు, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు ఎలా ఉందని ప్రశ్నించారు. ప్రస్తుతం బుక్‌లెట్లలో పేర్కొన్న సంక్షేమ పథకాలను వారి ముందు చదువుతూ ఈ పథకాలన్నీ మీకు అందాయా.. అని అడుగగా లబ్ధిదారులు అన్నీ వర్తించాయని చెప్పారు. ఇంకా ఏమేం సమస్యలున్నాయని తెలుసుకుని సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బందితో వెంటనే పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ మీకు మంచి జరిగితేనే మాకు ఓటేయండని ముఖ్యమంత్రి పిలుపునిచ్చినట్టుగా వచ్చే ఎన్నికల్లో సంక్షేమ ఫలాల ఆధారంగా జగన్‌మోహన్ రెడ్డిని, ఇక్కడ తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీ, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఎంపీడీవో పి.రవికుమార్, మండల జేసీఎస్ ఇన్‌చార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, సర్పంచ్ పిల్లా వసుంధర, వలంటీర్లు, సచివాలయ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. : ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: బొబ్బిలి పట్టణాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, పట్టణ అభివృద్ధి మేమే చేస్తామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని 30వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేతగాని వారి ప్రగల్భాలు నమ్మవద్దన్నారు. పనులు చేసే వారినే ప్రజలు గుర్తించి వారినే ఆశీర్వదించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఇంటి గోపాలరావు, కౌన్సిలరు వాడపల్లి వనజకుమారి, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

జాతీయ జెండాను గౌరవించాలి



రాజాం సిటీ: పింగళి చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి, తదితరులు

రాజాం సిటీ: భారతజాతిని, జాతీయ జెండాను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి అన్నారు. జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించిన స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కె.రవికుమార్, రెడ్‌క్రాస్, కోవిడ్-19 రిలీఫ్ టీమ్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, మక్క అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళులు

సంతకవిటి: మండలలలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం వజ్జ వెంకటరావు మాట్లాడుతూ, జెండా విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి జయంతి

తెర్లాం: జాతీయ జెండా రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతిని బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లైబ్రేరియన్ మాట్లాడుతూ యావత్తు భారతజాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి పింగళి వెంకయ్య అన్నారు. జాతీయ పతాకాన్ని రూపొందించి అందరి మన్ననలు పొందిన వ్యక్తి పింగళి వెంకయ్య అని కొనియాడారు. ప్రతీ విద్యార్థి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

మెరుగైన బోధన అందించాలి

వంగర: విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే మెరుగైన బోధన అందించాలని ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆ సమయంలో విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.రామకృష్ణ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

రాజాం సిటీ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో శానిటరీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శతశాతం ఫీవర్ సర్వే పూర్తిచేయాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన

బొబ్బిలి: మండలంలోని పారాది, మెట్టవలస గ్రామాల సచివాలయాలను ఎంపీడీవో పోతుల రవికుమార్ బుధవారం సందర్శించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడంలో సిబ్బంది ఎలా వ్యవహరిస్తున్నారన్న అంశంపై ఆరా తీశారు. ప్రతీ సంక్షేమ పథకంలోనూ అర్హులైన వారిని చేర్చాలని సిబ్బందిని ఆదేశించారు.

జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం

రేగిడి: జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే స్తంభాలు, ఇతర వస్తు సామగ్రిని మండల సబ్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. వన్నలిలో గల జగనన్న కాలనీలో బుధవారం స్తంభాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గార రమణ, జేఎల్ఎమ్ వెంకటేష, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ఉపాధి క్షేత్ర, సాంకేతిక సహాయకులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర, సాంకేతిక సహాయకులతో ఆ పథకం ఏపీవో సుశీల ఆధ్వర్యంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఈ నెల 9 నుంచి 15వరకు ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో శిలాఫలకాలను ఏర్పాటు చేసి వాటిపై అమృత్ సరోవర్ లోగో, గ్రామ పంచాయతీ వివరాలు, మాజీ సైనికోద్యోగుల పేర్లు రాయించాలని తెలిపారు. మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి ప్రజలందరితో ప్రతిజ్ఞ చేయించాలని, వసుధ వందనం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా సైనికులందరికీ ధన్యవాదాలు తెలిపే కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో డీవీ అప్పారావు, ఉపాధి ఏపీవో సుశీల తదితరులు పాల్గొన్నారు.

'మణిపూర్‌లో శాంతి స్థాపనకు చర్యలు చేపట్టాలి'



మణిపూర్ అల్లర్లకు నిరసనగా ర్యాలీ

తెర్లాం: మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను అరికట్టి, అక్కడ శాంతిని నెలకొల్పేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తగు చర్యలు చేపట్టాలని అంబేడ్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు నిరసనగా బుధవారం తెర్లాంలో ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజన తెగలకు ప్రత్యేక పాలన యంత్రాగాన్ని అమలు చేయాలన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న దాడులకు బీజేపీ, భజరంగదళ్, శివసేన లాంటి మత సంస్థలే కారణమని తెలిపారు. ఆర్థికంగా బలపడిన మెయితీ తెగను గిరిజన తెగ అయిన కుకీ తెగతో సమానంగా పరిగణించి ఎస్టీ రిజర్వేషన్లు కల్పించడం దారుణమైన విషయమన్నారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు స్పందించినంత వరకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం విచారకరమని చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్ర మాలమహానాడు ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఎండ గోపాలరావు, డీబీఎఫ్ నాయకుడు గంట సురేష్, మండల పాస్టర్ల ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, ఏఐఎం కన్వీనర్ పుచ్చల గురుమూర్తి, ఎస్ఎస్‌డీ నియోజకవర్గ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, మాలమహానాడు నాయకులు జీవన్‌కుమార్, గణపతిరావు పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్



దేవుదలలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలు తెలుపుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు

రేగిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో సంక్షేమ కాంతులు విరబూస్తున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని దేవుదల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగా రు. అనంతరం వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్ మోహన్‌రావు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, సర్పంచ్‌లు కుప్పిలి దుర్గమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కెంబూరు శ్రీహరిరావునాయుడు, కుప్పిలి గవరయ్య, సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరా వు, కరణం శ్రీనివాసరా వు, గార రమణ, కరణం గోవిందరావు, ఎంపీటీసీ సభ్యులు కురిటి రామకోటి, మజ్జి శ్రీనివాసరావు, పాగిరి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గోపెంపేటలో.....

మండల పరిధి దేవుదల పంచాయతీ గోపెంపేటలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.